

నేడు షబ్-ఏ- ఖదర్

రంజాన్ ప్రారంభమైన 26వ రోజున అల్లా అంతిమ దైవగ్రంథం దివ్య ఖురాన్ అవతరించింది. దీనిని షబ్-ఏ-ఖదర్‌గా పిలుస్తారు.

8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:25	శుక్ర : 4:57

గరిష్ఠం/కనిష్ఠం 39.2 /24.8

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. వేడి, ఉక్కపోత ఉంటుంది. తెల్లవారుజామున వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రుణాల రికవరీలో ఆదర్శం

- జిల్లాకు రాష్ట్రస్థాయి పురస్కారం
- మంత్రి సీతక్క చేతుల మీదుగా స్వీకరించిన అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్ దీపక్ తివారికి పురస్కారం అందిస్తున్న మంత్రి సీతక్క, తదితరులు

ఆసిఫాబాద్: స్త్రీనిధి(మెప్మా) రుణాల రికవరీలో ఆదర్శంగా నిలిచిన జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో 94 శాతం రుణాల రికవరీతో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రత్యేక పురస్కారానికి ఎంపికైంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో బుధవారం నిర్వహించిన స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి చేతుల మీదుగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, మహిళా సాధికారతపై అదనపు కలెక్టర్ దీపక్ తివారి చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. స్త్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్, మెప్మా హెడ్ మోతీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంక్వైరీ నంబర్ 94932 82510

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సుల సమయాలు, రూట్ వివరాలు తెలుసుకునేందుకు ఎంక్వైరీ నంబర్ 94932 82510 అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డీఎం కేవీ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ సౌలభ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బస్సు షెడ్యూల్, రూట్ మార్పు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నంబర్‌లో సంప్రదించాలన్నారు. ప్రయాణికుల సమయం ఆదా చేయడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తుందని తెలిపారు.

విద్యుత్ శాఖలో ఈ- స్టోర్ విధానం అమలు

ఆసిఫాబాద్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు విద్యుత్ శాఖలో ఈ-స్టోర్ విధానం అమలు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సర్కిల్ పరిధిలో సంబంధిత ఏఈ మొదటగా ఒక పనికి కావాల్సిన మెటీరియల్స్ స్టాక్ ఉందో లేదో ఎస్‌ఏపీ సాఫ్ట్‌వేర్‌లో చూసుకుని ముందస్తుగా రిజర్వ్ చేసుకుంటారని వివరించారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం ఉందని పేర్కొన్నారు. నూతన సాంకేతిక విధానంతో వినియోగదారులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

బస్టాండ్లలో సౌకర్యాలు కల్పించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ బస్టాండ్లలో అరకొర సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫ్యాన్లకు మరమ్మతులు చేపట్టాలని, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

‘చట్టవిరుద్ధంగా ప్రకటనలు ముద్రిస్తే చర్యలు’

రెబ్బెన(ఆసిఫాబాద్): నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ముద్రిస్తే కఠిన చర్యలు తప్పవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.అశ్విని అన్నారు. మండలంలోని పలు మెడికల్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. కొండపల్లి బస్టాప్ వద్ద ఉన్న మెడికల్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ఉన్న కారిఫోర్డ్ సిరప్‌ను సీజ్ చేశారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ 1954 చట్టం ప్రకారం మందుల లేబుళ్లు, కవర్లపై ప్రకటనలు ఇవ్వడం నేరమన్నారు. కారిఫోర్డ్ సిరప్‌పై జ్వరాన్ని తగ్గిస్తుందని ముద్రించారని తెలిపారు. చట్టవిరుద్ధంగా ప్రకటనను ముద్రించిన తయారీ సంస్థ తిరుపతి మెడికేర్ హైదరాబాద్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సామాన్యులకు సన్నబియ్యం

- రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం తీపికబురు
- ఏప్రిల్ నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- అక్రమ దందాలకు అడ్డుకట్ట పడే అవకాశం



కౌటాల(సిర్పూర్): రాష్ట్రంలోని రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణీ చేయనుంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం అందిస్తుండగా.. ఏప్రిల్ 1 నుంచి సన్నబియ్యం అందించనున్నారు. ఉగాది సందర్భంగా ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే అవసరమైన బియ్యం కోటా జిల్లాకు చేరింది. జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రజలకు బియ్యం పంపిణీ చేసేందుకు 314 రేషన్ షాపులు ఏర్పాటు చేశారు. మొత్తం 1,37,284 ఆహార భద్రత కార్డులు ఉండగా, ఇందులో అంత్యోదయ కార్డులు 12,948, తెల్లరేషన్ కార్డులు 1,24,336 ఉన్నాయి. మరో 21 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతినెలా 2,968 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం, అంత్యోదయ కార్డులదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 15 వరకు బియ్యం పంపిణీ కొనసాగుతుంది.

పెరిగిన సన్నాల సాగు

గత ప్రభుత్వం సైతం పేదలకు సన్నబియ్యం సరఫరా చేసే ప్రయత్నం చేసింది. రెండు, మూడు నెలలపాటు అరకొర సరఫరా చేయగా.. అందులో నూకలు, తౌడు రావడంపై విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత యథావిధిగా దొడ్డు బియ్యమే పంపిణీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సన్నబియ్యం పంపిణీకి కసరత్తు ప్రారంభించింది. అయితే సరిపడా సన్నబియ్యం నిల్వలు అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడింది. అనంతరం రాష్ట్రంలో సన్నాల సాగు పెంచేందుకు సర్కారు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో వానాకాలం సీజన్‌లో గణనీయంగా సన్నవడ్ల సాగు పెరిగింది. కొనుగోలు కేంద్రాల ద్వారా సన్నవడ్లను సేకరించారు. ప్రస్తుతం లబ్ధిదారులకు సరిపడా బియ్యం అందుబాటులో ఉండడంతో ఏప్రిల్ 1 నుంచి పంపిణీ ప్రారంభిస్తామని జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులు తెలిపారు.

పక్కదారి పట్టకుండా..

జిల్లాలో చాలామంది సన్నబియ్యమే తింటున్నారు. దీంతో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసే దొడ్డు బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లా సరిహద్దున మహారాష్ట్ర ఉండటంతో రోడ్డు, రైలు మార్గం ద్వారా రేషన్ బియ్యం తరలిపోతోంది. కొందరు డీలర్లకే బియ్యం అమ్ముకుని బదులుగా డబ్బులు, నిత్యావసర వస్తువులు తీసుకుంటున్నారు. నేరుగా డీలర్లే పెద్దమొత్తంలో రేషన్ బియ్యం సేకరించి దళారులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దళారుల నుంచి కొందరు రైస్ మిల్లర్లు మళ్లీ రూ.26కు కేజీ చొప్పున కొని.. ఆ బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి(ఎఫ్‌సీఐ)కి అప్పగించేవారు. మరికొందరు మిల్లర్లు సన్నబియ్యంగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. లక్ష్యం నీరుగారుతుండటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రేషన్ దుకాణాల్లో ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. సన్నబియ్యం పంపిణీతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

జిల్లాలో ప్రజాపంపిణీ వివరాలు

రేషన్ దుకాణాలు	314
అంత్యోదయ కార్డులు	12,948
తెల్లరేషన్ కార్డులు	1,24,336

ప్రతినెలా బియ్యం కోటా 2,968 మెట్రిక్ టన్నులు

క్యూఆర్ కోడ్‌తో కార్డులు

ప్రజాపాలన, మీసేవ కేంద్రాల ద్వారా జిల్లాలోని అర్హులు వేలాది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వివిధ స్థాయిల్లో వడబోత ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో దాదాపు పదేళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డులను క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డుల రూపంలో అందించేందుకు రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులన్నీ మహిళల పేర్లతో ఉన్నాయి. స్మార్ట్ కార్డులు కూడా మహిళల ఫొటోతో పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే.. ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉన్నారు..? రాయితీ బియ్యం ఎన్ని కిలోలు..? తదితర అంశాలతో కూడిన సమాచారం కనిపిస్తుంది. సన్నబియ్యం పంపిణీని ప్రారంభించనున్న నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్అర్బన్: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా తిర్యాణి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి విద్య, వైద్యం, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 20 గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో శుద్ధమైన తాగునీరందించేందుకు ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలన్నారు. అవసరమైన అనుమతులు పొందాలని ఆదేశించారు. అలాగే యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఆసిఫాబాద్ పట్టణ సమీపంలో ఏర్పాటు చేసేందుకు స్థలం గుర్తించాలని సూచించారు. ఆరు మినీ అంగన్‌వాడీ మోడల్ భవన నిర్మాణ పనులు చేపట్టాలని, ఎంపిక చేసిన ఆరు పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు తరగతి గదులు నిర్మించాలన్నారు. తిర్యాణి మండలంలో పాఠశాలలు, రైతువేదికలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో డిజిటల్ ఇంప్రూవ్‌మెంట్‌లో భాగంగా కంప్యూటర్లు, ప్రింటర్లు సమకూర్చాలన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీపీవో కోటయ్యనాయక్, డీటీడీవో రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, డీఎంహెచ్‌వో సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై యంత్ర పరికరాలు

- వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరణ
- సబ్సిడీతో మహిళా రైతులకు పనిముట్లు
- నియోజకవర్గాల వారీగా నిధులు కేటాయింపు
- దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ



ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే పలు పథకాల ద్వారా వారికి లబ్ధి చేకూరుస్తుండగా.. తాజాగా వ్యవసాయ పనిముట్లను సైతం రాయితీపై మహిళా రైతులకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సైతం మొదలైంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.72లక్షలు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరిస్తున్నాయి.

దరఖాస్తుల స్వీకరణ షురూ

గతంలో వ్యవసాయశాఖ కింద రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై అనేక యంత్ర పరికరాలు పంపిణీ చేసింది. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టారు. అయితే 2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఈ పథకం నిలిచిపోయింది. అప్పటి నుంచి రైతులు యంత్ర పరికరాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు మళ్లీ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించింది. సన్న, చిన్నకారు, ఇతర వర్గాల మహిళలు ఈ పథకానికి అర్హులు. ఈ నెల 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తులను వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారు. మండల, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. మార్కెట్‌లో వివిధ కంపెనీలకు చెందిన యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేస్తారు. సబ్సిడీ మొత్తాన్ని వ్యవసాయశాఖ సదరు కంపెనీలకు చెల్లించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మండలాల వారీగా పరికరాలు, నిధులు కేటాయించారు.

తీవ్ర పోటీ

యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే అర్హుల ఎంపిక జిల్లా వ్యవసాయ శాఖకు కత్తి మీద సాములా మారనుంది. రాష్ట్రంలో 2017 లోనే యాంత్రీకరణ పథకం ఆగిపోయింది. అప్పటి నుంచి రైతులు ప్రైవేట్‌లో యంత్ర పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు అద్దె ప్రతిపాదికన వినియోగించుకుంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం పథకాన్ని పునరుద్ధరించడంతో తీవ్రమైన పోటీ నెలకొంది. మరోవైపు జిల్లాలో పట్టా పాసు పుస్తకాలు ఉన్న రైతులు అతి తక్కువ మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 4.50 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా, ఎక్కువగా పురుషులకే పట్టాలు ఉన్నాయి. రాజకీయ జోక్యం లేకుండా, పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఏఈవో, ఏవోలను సంప్రదించాలి



వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో అర్హులైన రైతులకు రాయితీపై పరికరాలు అందజేస్తాం. సన్న, చిన్నకారు మహిళా రైతులు లబ్ధి పొందవచ్చు. క్లస్టర్ పరిధిలోని ఏఈవో, ఏవోలను సంప్రదించి దరఖాస్తులు అందజేయాలి. – శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

జిల్లా వివరాలు

పరికరాలు	కేటాయించిన యూనిట్లు	నిధులు (రూ.లక్షల్లో)
ట్రాక్టర్లు	4	20
పవర్ టిల్లర్	3	3
బ్రష్ కట్టర్లు	4	1.4
ఆపరేటెడ్ స్ప్రేయర్లు	92	0.92
పవర్ స్ప్రేయర్లు	92	8.28
రోటవేటర్లు	52	24.96
సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్	8	2.4
డిస్క్ హ్యారో రోటో పడ్లర్	5	10
బండ్ ఫార్మర్	03	0.39
పవర్ వీడర్లు	2	0.7

పుట్టెడు దుఃఖంలో ‘పది’ పరీక్షకు..

దహెగాం: తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖం ఉన్నా ఆ బాధను దిగమింగుకుంది.. అల్లారుముద్దుగా పెంచిన నాన్న ఇక లేడని తెలిసినా ఆయన కష్టం వృథా కావొద్దని పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరైంది ఓ విద్యార్థిని. ఈ విషాద ఘటన జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన మేకల రాజయ్య(40), సత్తక్క దంపతులకు కుమార్తె అనురాధ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనురాధ మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. రాజయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించగా, బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మృతిచెందాడు. అనురాధ తండ్రి చనిపోయిన బాధను దిగమింగుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం పరీక్షకు హాజరైంది. పరీక్ష పూర్తికాగానే కుటుంబీకులు విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లారు. తండ్రి మృతదేహాన్ని చూసి అనురాధ బోరున విలపించింది. స్వగ్రామంలో రాజయ్య అంత్యక్రియలు పూర్తిచేశారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న అనురాధ

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన గణితం పరీక్షకు 36 కేంద్రాల్లో 6,521 మంది విద్యార్థులకు 6,498 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్ తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

- ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులు చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై గుంపుల విజయ్‌తో కలిసి బుధవారం మండలంలోని లెండిగూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు అందించారు. బిలివర్స్ అకాడమీ జీకే మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సంప్రదించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్ ఉన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని కెరమెరి మండలం భోలాపటార్ గ్రామంలో గల దుకాణాలను బుధవారం ఏఎస్పీ చిత్తరంజన్ తనిఖీ చేశారు. 56 దేశీదారు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లెండిగూడలో మహిళా సంఘాలు మద్య నిషేధం అమలు చేస్తుండగా, గ్రామస్తులు భోలాపటార్‌కు వెళ్లి మద్యం తాగుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విద్యార్థులతో ఏఎస్పీ చిత్తరంజన్

జవాబుదారీతనంతో పనులు చేయించాలి

- డీఆర్‌డీవో దత్తారావు

రెబ్బెన(ఆసిఫాబాద్): జవాబుదారీతనంతో ఉపాధిహామీ పనులు చేయించాలని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను ప్రజావేదిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో ఈజీఎస్‌లో భాగంగా 371 పనులు చేపట్టగా.. కూలీల వేతనాల రూపంలో రూ.3.47 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.20.27 లక్షలు చెల్లించినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్ ద్వారా 78 పనులు చేపట్టగా కూలీల వేతనాలకు రూ.14.29 వేలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.1.58 కోట్లు చెల్లించినట్లు గుర్తించామని వెల్లడించారు. పంచాయతీల వారీగా చేపట్టిన పనుల వివరాలను తనిఖీ బృందం వివరించగా.. చాలాచోట్ల ఈజీఎస్ సిబ్బంది పూర్తిస్థాయిలో రికార్డులు నమోదు చేయకపోవడంపై డీఆర్‌డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, కొలతల్లో తేడాల కారణంగా కూలీలు నష్టపోవడం వంటి అంశాలు తనిఖీలో బయటపడినట్లు సభ్యులు తెలిపారు. బీపీఎంలు కూలీలకు చెల్లించాల్సిన డబ్బులను నెలల తరబడి వారి వద్దే ఉంచుకుంటున్నట్లు గుర్తించామని తెలపడంతో.. బీపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్‌డీవో ఆదేశించారు. కైరిగాంలో పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి పత్రాలపై ఏపీవో సంతకాలు లేకుండానే రూ.2లక్షల వేతనాలను కూలీలకు చెల్లించారని తెలిపారు. దానికి ఆపరేటర్ బాధ్యత వహించి కూలీలకు చెల్లించిన మొత్తాన్ని ఆయన ద్వారా రికవరీ చేయాలని డీఆర్‌డీవో ఆదేశించారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు శంకరమ్మ, శ్రీనివాస్, హెచ్‌ఆర్ మేనేజర్ మల్లేశ్, హ్యూమన్ రిసోర్స్‌పర్సన్ రజినీకాంత్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, ఏపీవోలు రామ్మోహన్‌రావు, బుచ్చన్న, ఎస్‌ఆర్పీ తిరుపతి, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఆర్‌డీవో దత్తారావు

‘ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం’

బెజ్జూర్(సిర్పూర్): రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బెజ్జూర్ మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలన్నా.. రైతుల కన్నీళ్లు ఆగాలన్నా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మండలంలోని గబ్బాయి, పాపన్‌పేట్, తలాయి, సోమిని, మొగవెల్లి, బారెగూడ, ముంజంపల్లి గ్రామాల్లో పర్యటించారు. రైతులు, మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుకుడ గ్రామంలోని పలువురు యువకులకు కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, నాయకులు కాశిపాక రాజు, సారయ్య, దుర్గం తిరుపతి, ఖాజా, షామ్‌ద్దిన్, ఆత్రం హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

క్లుప్తంగా

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

లక్ష్మణచాంద: చోరీ కేసులో వ్యక్తిని రిమాండ్ తరలించినట్లు శిక్షణ ఎస్సై ఎస్సై జుబేర్, ఏఎస్సై నారాయణరెడ్డి తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గవనే గంగప్రసాద్ అదే గ్రామంలో ఈనెల 24న అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గాండ్ల నరేశ్ కిరాణ షాపులో దొంగతనం చేశాడు. నరేశ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. కిరాణ షాపు వద్ద సీసీ పుటేజీ పరిశీలించారు. గంగప్రసాద్ చోరీ చేసినట్లు గుర్తించారు. అతని సెల్‌ఫోన్ కూడా అదే ప్రాంతంలో చూపడంతో బుధవారం పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.2300లు నగదు రికవరీ చేశారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు శిక్షణ ఎస్సై, ఏఎస్సై తెలిపారు.

కారును ఢీకొట్టిన బైక్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పతంగే సందీప్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తన బంధువులను పరామర్శించేందుకు భార్యతో కలిసి మంగళవారం రాత్రి కారులో వస్తున్నారు. ఈక్రమంలో రిమ్స్ ఆసుపత్రి ముందు మూలమలుపు వద్ద కొడప విఠల్ బైక్‌తో కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, అందులో కూర్చున్న సందీప్ భార్య స్వప్నకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై విష్ణుప్రకాశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లు సీజ్



సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని అనంత ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. అనంత ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుకు సంబంధించి 2022–23 రబీ సీజన్ తీసుకున్న 3,191 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు తెలపాలని గతంలో నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీఎస్‌ఓ ఆదేశాలతో రైస్ మిల్లును సీజ్ చేసినట్లు తెలిపరాు. నిర్వాహకులు లేకపోవడంతో రైస్‌మిల్లు తాళాలు పగులగొట్టి అధికారులు, పోలీసు అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఆర్‌ఐ నవజ్యోతి, ఏఎస్సై శంకర్, సిబ్బంది ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం

ఖానాపూర్: కడెం నుంచి తర్లపాడ్ మీదుగా ఖానాపూర్ వైపు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. 5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేయడంతోపాటు తదుపరి చర్యల నిమిత్తం ఆటోతోపాటు బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ రహమత్‌ను అదుపులో తీసుకున్నారు.

ఇవేం గ్లౌజ్‌లు!

- కొద్దిరోజులుగా నాసిరకమైనవి పంపిణీ
- చిరిగిపోతున్నా పట్టింపేది
- నలిగిపోతున్న చేతులు
- ఇబ్బంది పడుతున్న కార్మికులు



ఆర్కే న్యూటెక్ గనిలో చిరిగిపోయిన గ్లౌజ్‌ను చూపెడుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: నాసిరకం చేతిగ్లౌజ్‌లతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గనుల్లో పని చేసేటప్పుడు చేతులకు గాయాలు కాకుండా వీటిని ఉపయోగిస్తారు. గతంలో నాణ్యమైనవి ఇచ్చినప్పటికి కొద్దిరోజులుగా నాసిరకంగా ఉంటున్నాయని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లలో కార్మికులు వినియోగిస్తున్న గ్లౌజ్‌లు కొన్నిరోజులకే చిరిగిపోతున్నాయి. ప్రతీ డిజిగ్నేషన్ కార్మికుడు పని చేసేటప్పుడు చేతులు నలుగకుండా, గాయాలు కాకుండా ఉండాలనే ఉద్దేశంతో మూడేళ్లుగా చేతిగ్లౌజ్‌లు ఇస్తున్నాయి. ఎలక్ట్రికల్ పనులు, భారీ యంత్రాలు, పనిముట్లతో పనిచేసేవారికి, ట్రామర్లు, లైన్‌మెన్లు, ఇంజినీరింగ్ డిపార్టుమెంట్, సివిల్ డిపార్టుమెంట్ ఉద్యోగులకు వేర్వేరు క్వాలిటీలతో కూడిన గ్లౌజ్‌లు ఇస్తారు. ఇందులో ఎక్కువ మంది ఉపయోగించే రెగ్యులర్ మోడల్ గ్లౌజ్‌లు నాసిరకంగా వస్తున్నాయి. వీటి టెండర్‌ను పొందిన సదరు కంపెనీ నాసిరకంవి సరఫరా చేస్తూ కంపెనీకి నష్టం చేస్తుందని కార్మికులు పేర్కొంటున్నారు. గతంలో ఇచ్చిన గ్లౌజ్‌లు కనీసం మూడునెలల వరకు పనిచేసేవని ఇప్పుడు నెల రోజులకే చిరిగిపోతున్నాయని వాపోతున్నారు.

అధికారుల దృష్టికి..

జనవరిలో జరిగిన ఏరియా స్థాయి స్ట్రక్చరల్ మీటింగ్‌లో ఈ సమస్యను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు అధికారుల దృష్టికి తెచ్చారు. నాసిరకంగా వస్తున్నాయని అధికారుల అంగీకరించారు. అయితే గ్లౌజ్‌లు సరఫరా చేస్తున్న కంపెనీ మార్కెట్‌లోనే టాప్ కంపెనీ అని వారివద్ద నుంచి కూడా ఇలాంటివి సరఫరా కావడంపై విస్మయం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే ఈ నాసిరకం గ్లౌజ్‌లు చిరిగిపోయిన వెంటనే వాటి స్థానంలో కనీసం కొత్తది ఇవ్వాల్సి ఉండగా కొందరు గనుల అధికారులు ఇవ్వకుండా స్టాక్ లేదంటూ వాటితోనే పని చేయాలని ఒత్తిడి తెస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. స్టోర్స్‌లలో స్టాక్ ఉన్న కూడా కొత్తవి ఇవ్వకపోవడం సరికాదంటున్నారు. ఇప్పటికైనా యజమాన్యం స్పందించి నాణ్యమైన గ్లౌజ్‌లు తెప్పించి ఇవ్వాలని కోరుతున్నారు.

నాణ్యమైనవి తెప్పిస్తాం

గ్లౌజ్‌లు నాసిరకంగా వస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. సరఫరా చేసే కంపెనీతో మాట్లాడి నాణ్యమైనవి తెప్పిస్తాం.
– శ్రీధర్‌రావు, ఏఎస్‌ఓ, శ్రీరాంపూర్

రోడ్ల వెంట మొక్కల పెంపకం

- అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్




తలమడుగు: మొక్కలను పరిశీలిస్తున్న శరవణన్

తాంసి: హరితనిధిలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు రోడ్ల వెంట పచ్చదనం పెంచేందుకు మొక్కల పెంపకం చేపడుతున్నట్లు అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్ తెలిపారు. తాంసి అటవీశాఖ సెక్షన్ పరిధిలో అంతరాష్ట్ర రోడ్డుకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ తనిఖీ చేశారు. మండలంలోని హస్నాపూర్ వద్ద నాటిన మొక్కలను డీఎఫ్‌ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్‌తో కలిసి పరిశీలించారు. నాటిన మొక్కల వివరాలు, పెంపకం, రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శరవణన్ మాట్లాడుతూ హరిత నిధిలో భాగంగా జిల్లాలో 87 కి.మీ మేర రోడ్లు ఇరువైపులా మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేశామన్నారు. రేంజ్ ఆఫీసర్ గులాబ్, సెక్షన్ అధికారి అహ్మద్ ఖాన్,బీట్ ఆఫీసర్ సాయికుమార్ ఉన్నారు.

నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తలమడుగు: అంతర్రాష్ట్ర రహదారి ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని అటవీ శాఖ సీసీఎఫ్ శరవణన్ అన్నారు. మండలంలోని సుంకిడి, లింగి, కుచులాపూర్, లక్ష్మీంపూర్ గ్రామాల్లోని అంతర్రాష్ట్ర రహదారి ఇరువైపులా నాటిన మొక్కలను బుధవారం పరిశీలించారు. అంతర్రాష్ట్ర రహదారి పొడవునాటిన మొక్కలు వేసవిలో ఎండిపోకుండా నీటిని అందించాలన్నారు. మొక్కలను పశువులు తినకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం లింగి గ్రామంలోని వృద్ధాశ్రమంలో మొక్కలు నాటారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. డీఎఫ్‌ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఆర్‌ఓ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

ఆర్జీయూకేటీ వీసీకి అరుదైన గౌరవం



బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్‌లో...

బాసర: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విధులు నిర్వహిస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌కు బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్‌లో అరుదైన గౌరవం దక్కింది. తాజా ఎడిషన్–140ని వెల్లడించగా.. అందులో భారతదేశ భవిష్యత్‌ను రూపొందించడంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతపై ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్‌కు ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏవో రణధీర్, అసోసియేట్ డీన్స్ డాక్టర్ విఠల్, విభాగాల అధిపతులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అధ్యాపకులతో వీసీ సమీక్ష

ఆర్జీయూకేటీ అధ్యాపకులతో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ నాక్ అక్రిడిటేషన్‌తో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇన్‌స్టిట్యూషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐయూఏసీ), సెల్ఫ్ స్టడీ రిపోర్ట్స్ (ఎస్ఎస్ఆర్), వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సమావేశాలు, అధ్యాపక విజయాలు, ప్రాజెక్ట్ వర్క్‌లను సమన్వయం చేయాలన్నారు. టెక్ ఫెస్ట్, స్పోర్ట్స్ డే, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంలో అధ్యాపకులు, కన్వీనర్లు సహకారం అందించారన్నారు. సమావేశంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీ దర్శన్, ఎవో రణధీర్, అసోసియేట్ డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మహేశ్ (ఫైల్)

వాంకిడి: పెళ్లికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కోమటిగూడ గ్రామానికి చెందిన కొట్రాంగి మహేశ్(29) కొత్త దుబ్బగూడలో బంధువుల పెళ్లికి మంగళవారం వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటాక మహారాష్ట్రలోని భారి గ్రామానికి చెందిన ముండె మానిక్‌రావు ఆటోలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఆటో ప్రమాదానికి గురైంది. గ్రామ సమీపంలోని రహదారిపై మూలమలుపు వద్ద ఉన్న స్తంభానికి వేగంగా ఢీకొట్టింది. దీంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భయందోళనకు గురైన మానిక్‌రావు బోల్తా పడ్డ ఆటోను లేపుకొని భారీ గ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం స్థానికులు అటుగా వెళ్తుండగా మహేశ్ పడి ఉండటాన్ని గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలం వద్ద ఆటో నంబర్, పగిలిన అద్దాలు పడి ఉండటంతో రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన మానిక్‌రావును అదుపులో తీసుకున్నారు. కాగా, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడికి భార్యతోపాటు నాలుగేళ్ల కూతురు ఉంది. మృతుడి తండ్రి ఆనంద్‌రావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావల పోలీసుస్టేషన్ పరిధిలో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ ప్రాంతంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో స్కావెంజర్‌గా పనిచేస్తున్న గంగన్న (42) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బయల్దేరిన ఆయన తిరిగి రాలేదు. మద్యం మత్తులో పాలిటెక్నిక్ శివారు ప్రాంతంలోని చెత్తకుప్పలో ఆయన మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు ఓంకార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



చంద్రకాంత్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని బిక్కుతాండ గ్రామంలో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు.. సెడ్మాకి చంద్రకాంత్(28) వ్యవసాయ కూలీ పని చేస్తున్నాడు. భార్య మంజుల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు. చంద్రకాంత్ గత 10 రోజులుగా జ్వరం బాధపడుతున్నాడు. మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరించడంతో కుటుంబీకులు ముత్నూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో కుదుటపడింది. ఇంటికి వచ్చాక తనకు ఏదో అవుతుందని భయపడేవాడు. రాత్రి ఇంట్లో నిద్రపోయేవాడు కాదు. బుధవారం ఉదయం భార్యను డ్యూటీకి వెళ్లాలని చెప్పి ఆమె వెళ్లాక దూలానికి ఉరేసుకున్నాడు. చుట్టూపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పంచనామ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ఆదిలాబాద్‌టౌన్: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకర్ రావు బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 2022 ఆగస్టు 21న జైనథ్ మండలంలోని రాంపూర్(టి)కు చెందిన నేరస్తుడు కొడిమెల ప్రభాకర్ పాత కక్షలతో ఉట్ల రమేశ్‌ను బుద్ధ విహార వద్ద విచక్షణారహితంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటనపై ఎస్సై బి.పెర్సిస్ కేసు నమోదు చేయగా, సీఐ నరేశ్ కుమార్ సాక్షులను విచారించి చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఎం.గంగాసింగ్, కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ విచారణ జరిపి 18 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, పీపీ మధుకర్ విచారించి నిందితుడిపై నేరం రుజువు చేశారు. ఈ మేరకు నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకర్ రావు తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన కోర్టు డ్యూటీ అధికారి, లైజన్ అధికారితోపాటు పీపీలను ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా తప్పించుకోలేరన్నారు. నేరం చేసేవారికి శిక్ష పడుతుందనే నమ్మకం న్యాయస్థానం ద్వారా కలుగుతుందన్నారు. సమాజంలో నేరాల శాతం తగ్గుముఖం కావాలంటే న్యాయస్థానంలో శిక్ష శాతం పెరగాలని పేర్కొన్నారు.

బంగారం గొలుసు చోరీ

ఇచ్చోడ: బస్సు కోసం వేచిచూస్తున్న మహిళకు బైక్‌పై నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు మాయ మాటలు చెప్పి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. మండలంలోని బోరిగామకు చెందిన ముక్కల లక్ష్మి బుధవారం ఉదయం 11 గంటలకు గాంధీనగర్ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచిచూస్తుంది. ఈక్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె వద్దకు వెళ్లారు. భార్య బంగారం గొలుసు పోయిందని, అందరి వద్ద చెక్ చేస్తున్నామని ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించారు. మహిళ మెడలో బంగారం గొలుసు తీసి ఇవ్వమని అడిగారు. వారి మాటలు నమ్మి గొలుసు ఇవ్వగానే చూసినట్లుగా నమ్మించి ఒక పేపర్లో చుట్టి ఆమె చేతికి ఇచ్చి పరారయ్యారు. ఆ పేపర్‌లో చూడగా బంగారు గొలుసు లేకపోవడంతో లబోదిబోమంది. పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. చోరీకి గురైన గొలుసు తులం వరకు ఉంటుందని తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బెదిరించి..

ఉట్నూర్‌రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ఎస్పీ సారూ పిలుస్తున్నారని ముగ్గురు యువకులు బెదిరించి ఆమె మెడలో బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలో బుధవారం పట్టపగలే ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంద్రవెల్లి మండలానికి చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా పని నిమిత్తం బుధవారం ఉట్నూర్‌కి వచ్చింది. స్థానిక జూనియర్ మున్సిఫ్ కోర్టు ముందు నడుచుకుంటూ వెళ్తుండగా ఎస్పీ సారూ పిలుస్తున్నారని గేటు వద్ద ముగ్గురు పోలీసులమని దూరం నుంచి ఐడీ కార్డు చూపెడుతూ బెదిరించారు. మాయమాటలతో ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. కాగా, ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన తబ్రేజ్ పాషా బుధవారం ఉదయం పాల కోసం వెళ్లి పాలు తెచ్చి ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశారు. 10:30 గంటల సమయంలో చూడగా బైక్ కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఇసాక్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ బోల్తా



బోల్తాపడ్డ కంటైనర్

సోన్: మండలంలోని గంజాల్ సమీపంలో బుధవారం 44వ జాతీయ రహదారి పక్కన కంటైనర్ బోల్తాపడింది. ఎస్సై గోపి కథనం ప్రకారం.. కంటైనర్ నాగపూర్ నుంచి చెట్ల మూలికలతో హైదరాబాద్ వైపు వెళ్తోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ దుర్గేష్ కుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో కంటైనర్ బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు షబ్–ఏ– ఖదర్

- ఖురాన్ అవతరణ దినం
- మహోత్తరమైన రాత్రిగా గుర్తింపు



ఖురాన్ పఠనం చేస్తున్న బాలురు

నెన్నెల: రంజాన్ మాసంలో ఇస్లాం చరిత్రలోనే ముఖ్యమైన రాత్రి. ఈ మాసం ప్రారంభమై గురువారానికి 26వ రోజున అల్లా అంతిమ దైవగ్రంథం దివ్య ఖురాన్ అవతరించింది. దీన్ని షబ్–ఏ–ఖదర్‌గా పిలుస్తారు. ఈ గ్రంథం మార్గనిర్దేశం చేస్తుందని నెన్నెల జామా మసీదు మౌలానా షగీర్ అహ్మద్ బర్కద్‌వా చెప్పారు. ఖురాన్ సన్మార్గ బాటలో పయనించడానికి ఉపకరిస్తుందని వివరించారు. ఖురాన్ పఠనం చేసిన వారి సంఖ్య భారీగా ఉండటం దైవ సంకల్పానికి నిదర్శమన్నారు. పదేళ్ల వయస్సు చిన్నారులు దీన్ని పఠించడం విశేషమన్నారు. చరిత్ర పుటల్లో ఏ పుస్తకాలను తిరగేసినా కాలానుగుణంగా మార్పు చెందుతాయని, అదే ఖురాన్ అవతరించి సుమారు 1450 ఏళ్లు దాటుతున్నా అక్షరం కూడా మార్పు చెందలేదన్నారు. ఖురాన్‌లో 30 పారాలు(పాఠాలు), 114 సూరాలు, 6666 వ్యాఖ్యలు ఉన్నాయని చెప్పారు.

అశాంతి రాజ్యమేలిన నేపథ్యం..

అరబ్బుల హయాంలో అశాంతి రాజ్యమేలిన నేపథ్యమే దివ్య ఖురాన్ అవతరణకు మూలమని మౌలానాన షగీర్ అహ్మద్ బర్కద్‌వా తెలిపారు. అప్పట్లో ఎక్కడ కూడా ప్రశాంత వాతావరణం కనిపించేది కాదని, ఒకరి హక్కులు మరొకరు కాలరాస్తూ పరస్పరం దూషించుకుంటూ దాడులకు పాల్పడుతూ గడిపేవారని వివరించారు. ఈ నేరమయ సంస్కృతిని చూసి మహ్మద్ ప్రవక్త చలించిపోయి మానసిక ఉపశమనం కోసం 'ఘారెహిర' అనే గుహలో ఒంటరిగా కూర్చొని అల్లాను స్మరించుకునేవారని, ఒకరోజు అల్లాహ్ తన దూత జిబ్రాయిల్ ద్వారా మహ్మద్ ప్రవక్తకు చేరవేసిన సందేశం చదివాక ప్రవక్త మనస్సు ఆలోచనతో ప్రపంచ గమనాన్ని చుట్టి వచ్చిందన్నారు. ఆ సందేశాలకు విస్తత ప్రచారం కలిగిస్తే ప్రజలకు చెడు నుంచి విముక్తి కలిగించి సన్మార్గంలో నడపొచ్చని ఆయన ప్రగాఢంగా విశ్వసించారని చెప్పారు. వాటి నుంచి అల్లాహ్ తన సందేశం వినిపించేవారని, అలా నలభై ఏటా నుంచి దశల వారీగా 30 ఏళ్ల పాటు అల్లాహ్ అందించిన భిన్న సందేశాల సమాహారమే ఖురాన్ మహాగ్రంథం. రంజాన్ మాసంలోని 26 నాడు అవతరించిందని వివరించారు. ఖురాన్ చదవడానికి ముందు విధిగా వజూ చేసి ఆపై ఖురాన్‌ను చేతపట్టుకుని ఖిబ్లా(పడమర) వైపు తిరిగి దైవనామస్మరణతో చదవాలని వివరించారు.

వెయ్యి నెలల పుణ్యఫలం



పవిత్ర గ్రంథం ఖురాన్‌ను ఈ రాత్రే అల్లాహ్ ప్రసాదించారని దీన్ని పవిత్రమైన రాత్రిగా పాటిస్తాం. వెయ్యినెలల రాత్రులకంటే ఎంతో ఘనమైంది. ఈ రాత్రి జాగరణ చేస్తూ నమాజ్‌ను ఆచరిస్తుంటాం. దివ్య ఖురాన్‌ను పఠిస్తాం. రాత్రి జాగరణతో పుణ్యఫలాలు లభిస్తాయనే విశ్వాసం ముస్లిం సోదరుల్లోలో ఉంది.
–షగీర్ అహ్మద్ బర్కద్‌వా, మత గురువు, నెన్నెల

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



పల్లెం రాజును అభినందిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్: మందమర్రికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి పల్లెం రాజలింగు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. గోవాలో ఇటీవల జరిగిన 47వ యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. 75 సంవత్సరాల విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో వరంగల్ క్రీడాకారుడు నర్సయ్యతో కలిసి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించి, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన రాజలింగును బుధవారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జాయింట్ సెక్రటరీ రమేశ్ రెడ్డి, అడ్వైజర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారుడు మురళీ అభినందించారు. ఈ సందర్భంగా రాజలింగు మాట్లాడుతూ థాయిలాండ్‌లో నిర్వహించే అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యానని తెలిపారు. గతంలో రెండుసార్లు ఈ పోటీలకు ఎంపికయ్యానని ఆర్థిక స్థోమత లేక పోటీల్లో పాల్గొనలేదన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా సహకరిస్తే రాష్ట్రం నుంచి పతకం సాధిస్తానని తెలిపారు.

కూతురిపై అసభ్యంగా ప్రవర్తించిన తండ్రి

- పోక్సో కేసు నమోదు
- మందమర్రిలో ఘటన



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: కూతురిపై అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు నమోదైంది. పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుస్టేషన్‌లో ఎస్సై రాజశేఖర్ ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన ఆకుదారి సతీశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యతో గొడవలు జరుగుతున్నాయి. పెద్ద కూతురు (15) హాస్టల్‌లో చదువుతుండగా పోచమ్మకు చేసుకునేది ఉందని మంగళవారం తీసుకువచ్చాడు. సాయంత్రం మద్యం తాగి ఇంటికి చేరుకుని కూతురు తనకు పుట్టలేదని అనుమానంతో ఆమెపై రాత్రి అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన భార్యను గాయపరిచాడు. భార్య ఫిర్యాదుతో బుధవారం పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలిని కౌన్సెలింగ్ నిమిత్తం భరోసా కేంద్రానికి పంపినట్లు పేర్కొన్నారు.

మామిడి తోట వేలం



వేలం నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉట్నూర్ ఉద్యాన నర్సరీలో మామిడి తోట బహిరంగ వేలంలో రికార్డు ధర పలికింది. 350 మామిడి చెట్లకు రూ.10 లక్షల 5 వేల వరకు పలికింది. ఉట్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, జైనూర్, ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి 17 మంది వ్యాపారులు వేలం పాల్గొనానరు. న్యాను రూ.10 లక్షల 5 వేలకు వేలం పాడి తోటను దక్కించుకున్నారు. 2021లో వేలంలో రూ.4.66 లక్షలు ఆదాయం మొదటిసారిగా వచ్చిందని పీవో పేర్కొన్నారు. అనంతరం సాగు చేస్తున్న పుచ్చకాయపై ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి సారి ఉద్యాన నర్సరీలో పుచ్చకాయ సాగుపై అధ్యయనం చేయడంపై అభినందించారు. వేలం పాట కమిటీ సభ్యులు గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ, పరిపాలన అధికారి దామోదర స్వామి, ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్‌కుమార్, ఉద్యాన విభాగ సిబ్బంది జయ రాజు, అర్పిత, సాయిరాజ్, పూల, రమేశ్ పాల్గొన్నారు.

315 కిలోల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: 315 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శశిధర్‌రెడ్డితో కలిసి ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఇటీవల దేవాపూర్ పీఎస్‌లో నమోదైన నకిలీ పత్తినాల కేసులో గుడిమల్ల చంద్రయ్య, కూనారపు బాలకృష్ణ, మహమ్మద్‌సాహెబ్ జానీ, ముల్కల్ల సుధీర్, గోవిందుల శంకర్‌ను అదుపులో తీసుకున్నారు. అదే కేసులో మరో నిందితుడు అబ్దుల్ రజాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి గాలించగా బుధవారం మందమర్రిలో పట్టుబడ్డాడు. అతన్ని విచారించగా గుజరాత్ రాష్ట్రం నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. పట్టణానికి చెందిన కాశిపాక తిరుపతి సహాయంతో పొన్నారానికి చెందిన బొలిశెట్టి జనార్దన్‌కు విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. వారు అందించిన సమాచారంతో దేవాపూర్‌లోని చింత గూడ సల్పల వాగు పక్కన దాచిన 315 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వీటి విలువ రూ.7,87,500 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కాసిపేట ఏవో ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించి అబ్దుల్ రజాక్, కాశిపాక తిరుపతి, బొలిశెట్టి జనార్దన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, దేవాపూర్ ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

దూడకు పాలిచ్చిన గేదె



ఇచ్చోడ: మండల కేంద్రంలోని జై శ్రీరాం గోశాలలో పేగు బంధం కాకపోయిన మూడు నెలల దూడకు ఓగేదె పాలిచ్చింది. గోశాలలో మూడునెలల క్రితం ఆవు ఓ దూడకు జన్మనిచ్చి అకస్మాత్తుగా మృత్యువాతపడింది. పాలు లేక దూడ ఆకలితో అలమటిస్తుంది. నిర్వాహకుడు ఐద రాజేశ్ ఆ దూడకు గేదె పాలు తాగించే ప్రయత్నం చేశారు. క్రమంగా అలవాటు పడ్డ గేదె పాలిస్తుండగా సాక్షి క్లిక్ మనిపించింది.